సాక్షి
అనంతపురం
మంగళవారం । 4 । ఫిబ్రవరి । 2025



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి.



టమాట కిలో రూ.14

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.14 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.11 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.8°/13.5°

జిల్లా అంతటా సోమవారం చలి వాతావరణం కొనసాగింది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఫీజు పోరు మార్చి 12కు వాయిదా

• వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం కార్పొరేషన్: రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో 'ఫీజు పోరు'ను మార్చి 12వ తేదీకి వాయిదా వేసినట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ర్యాలీల నిర్వహణకు ఎన్నికల కమిషన్ నిరాకరించడంతో పార్టీ అధిష్టానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజల పక్షాన నిలబడతామన్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు మేలుకుని విద్యార్థులకు రూ.3,900 కోట్ల ఫీజు బకాయిలను తక్షణం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

'కాసుల సర్వే'పై విచారణ



అనంతపురం అర్బన్: సర్వే చేసేందుకు సర్వేయర్ డబ్బులు వసూలు చేయడాన్ని సర్వే భూ రికార్డుల శాఖ ఏడీ రూప్లానాయక్ తీవ్రంగా పరిగణించారు. ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించారు. సోమవారం సాక్షిలో ప్రచురితమైన ''కాసుల సర్వే'' కథనానికి ఆయన స్పందించారు. పామిడి మండల పరిధిలోని ఒక గ్రామానికి చెందిన సర్వేయర్ డబ్బు వసూలు వ్యవహారంపై విచారణ చేయిస్తున్నట్లు వెల్లడించారు. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు.

అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు ఎంపిక


స్కేటింగ్ మాస్టర్ రాజశేఖర్‌తో రిత్విక్ రెడ్డి

గుత్తి: పట్టణానికి చెందిన రమేష్ రెడ్డి, శ్రీదేవి దంపతుల కుమారుడు రిత్విక్ రెడ్డి అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. వివరాలు.. పట్టణంలోని వివేకానంద పాఠశాలలో యూకేజీ చదువుతున్న రిత్విక్ రెడ్డి గుత్తి స్కేటింగ్ అకాడమీలో మాస్టర్ రాజశేఖర్ పర్యవేక్షణలో తర్ఫీదు పొందాడు. తమిళనాడు రాష్ట్రంలోని మధురైలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 వరకూ జరిగిన జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో పాల్గొన్నాడు. ఇందులో రిత్విక్ రెడ్డి ప్రతిభ కనబరచడంతో నిర్వాహకులు అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు స్కేటింగ్ మాస్టర్ రాజశేఖర్ చెప్పారు. త్వరలో విదేశాల్లో జరిగే పోటీల్లో రిత్విక్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

కల్తీ పాల యూనిట్ సీజ్


కల్తీ పాల యూనిట్‌ను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

అనంతపురం: కల్తీ పాల యూనిట్‌ను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. రాప్తాడు మండలం ఎం. బండమీద పల్లి గ్రామానికి చెందిన ఎర్రగుంట రామిరెడ్డి ఇంట్లో కల్తీ పాల యూనిట్‌పై సోమవారం విజిలెన్స్ అధికారులు మెరుపుదాడి చేశారు. పామ్ ఆయిల్, ఉప్పు, మాల్టోడెక్స్ట్రిన్ పౌడర్‌తో చిక్కని ద్రవం తయారు చేసి లీటరు పాలపై రూ. 10 అదనంగా సంపాదించాలనే ఆశతో కల్తీ చేస్తున్నట్లు వెల్లడైంది. ఈ పాలు తాగితే గ్యాస్ట్రిక్ సమస్యలతో పాటు క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని డాక్టర్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో కల్తీ పాల యూనిట్‌ను సీజ్ చేసి, పాల నమూనాలను హైదరాబాద్ ల్యాబ్‌కు పంపారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడితే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ అధికారి వైబీపీటీఏ ప్రసాద్ హెచ్చరించారు.

ప్రశాంతంగా పరీక్ష

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సోమవారం 'పర్యావరణ విద్య' పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 25,798 మంది విద్యార్థులకు గాను 25,037 మంది హాజరయ్యారు. 761 మంది గైర్హాజరయ్యారు. కన్వీనర్, జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి ఎం. వెంకటరమణనాయక్ మూడు కేంద్రాలను పరిశీలించారు. డీఈసీ సభ్యులు నాలుగు పరీక్ష కేంద్రాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు 18 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు.

జేసీకి జీ హుజూర్!



• అంతులేని 'పచ్చ'పాతం • తాడిపత్రిలో జేసీ ప్రభాకర్ రెడ్డికి పోలీసుల దాసోహం
• మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి పట్టణంలోకి అడుగుపెట్టకుండా అడ్డగింత
• శాంతిభద్రతల మాటున 8 నెలలుగా డ్రామాలు • తాజాగా ఆయన స్వగ్రామంలో పెద్దారెడ్డి హౌస్ అరెస్టు
• ఇంటి వద్ద భారీగా మోహరించిన వైనం • ఖాకీల నిరంకుశ తీరుపై తీవ్ర విమర్శలు

సాక్షి ప్రతినిధి అనంతపురం: రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలోనూ లేని దారుణ పరిస్థితులు 'తాడిపత్రి'లో నెలకొన్నాయి. కూటమి సర్కారు కొలువుదీరినప్పటి నుంచి అటు జేసీ వర్గీయుల ఆగడాలు, ఇటు పోలీసుల నిరంకుశ వైఖరితో నియోజకవర్గంలో సామాన్యులకు రక్షణ లేకుండా పోయింది. ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలపై దాడులు జరిగి.. ఫిర్యాదు చేయడానికి వెళితే రివర్స్ కేసులు బనాయించి జైల్లో వేస్తున్న పరిస్థితి నెలకొంది. ఇదంతా ఒకెత్తయితే మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి నియోజకవర్గంలోకి రాకుండా పోలీసులు అడ్డుకుంటున్న తీరు వారి నిరంకుశ వైఖరికి అద్దం పడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

8 నెలలుగా...

2024 మే 13న సార్వత్రిక ఎన్నికలు జరిగాయి.ఆ సమయంలో తాడిపత్రిలో అల్లర్లు జరగడంతో జేసీ ప్రభాకర్‌రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డిపై కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో ఇరువురూ కొన్ని రోజులు తాడిపత్రి నియోజకవర్గంలోకి వెళ్లకూడదని కోర్టు ఆంక్షలు విధించింది. ఆ తర్వాత ఇద్దరికీ బెయిలు రాగా, జేసీ ప్రభాకర్ రెడ్డి తాడిపత్రికి వెళ్లారు. ఇదే క్రమంలో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాడిపత్రి వెళ్లాలని ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకున్నారు. ఇక.. అప్పటి నుంచి ఆయన తాడిపత్రికి బయలుదేరితే చాలు అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్నారు.

అడుగులకు మడుగులొత్తుతూ..

కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తున్నారన్న సమాచారం అందగానే టీడీపీ కార్యకర్తలను జేసీ ప్రభాకర్ రెడ్డి రెచ్చగొడుతున్నారు. వాట్సాప్‌ల ద్వారా మెసేజ్‌లు పంపి పట్టణంలో అలజడులు సృష్టించాలని ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో శాంతి భద్రతల పేరుతో జేసీ అడుగులకు మడుగులొత్తుతూ పోలీసులు పెద్దారెడ్డిని అడ్డుకుంటుండటం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఒక మాజీ ఎమ్మెల్యేను 8 నెలలుగా తాడిపత్రిలోకి రానివ్వడం లేదంటే 'పచ్చ' నేతకు ఖాకీలు ఎంతలా దాసోహమయ్యారో అర్థం చేసుకోవచ్చు. సోమవారం కూడా తాడిపత్రికి బయలుదేరిన పెద్దారెడ్డిని యల్లనూరు మండలంలోని ఆయన స్వగ్రామం తిమ్మంపల్లిలో గృహ నిర్బంధం చేశారు. బలగాలను మోహరించి బయటకు రానివ్వలేదు.అంతే కాకుండా తాడిపత్రిని అష్టదిగ్బంధనం చేశారు. పట్టణం చుట్టూ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ప్రజలను భయాందోళనకు గురి చేశారు.

కోర్టు కేసు సాకుతో...

మాజీ ఎమ్మెల్యే అయిన తనకు తాడిపత్రిలోకి వెళ్లే అవకాశం కల్పించడంతో పాటు పోలీసు రక్షణ కల్పించాలని పెద్దారెడ్డి కోర్టుకు వెళ్లారు. ఈ క్రమంలో కోర్టులో కేసు ఉందన్న సాకుతో పోలీసులు ఆయన్ను పట్టణానికి వెళ్లనివ్వడం లేదు. గత వైఎస్సార్ సీపీ హయాంలో టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి నిత్యం తాడిపత్రిలోనే ఉండేవారు. అప్పట్లో ఆయనపై ఎన్నడూ ఇలాంటి ఆంక్షలు విధించలేదు. కానీ నేడు శాంతి భద్రతల పేరుతో పెద్దారెడ్డిని అడ్డుకుంటుండటం గమనార్హం. కోర్టు అనుమతి ఇచ్చేవరకూ మాజీ ఎమ్మెల్యేకు పోలీసులు రక్షణ కల్పించలేరా అన్న సందేహాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. తాడిపత్రిలో ఇటీవల గంజాయి విక్రయాలకు, మట్కాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతుండటంతో నిత్యం భయంభయంగా గడపాల్సిన పరిస్థితి. అసాంఘిక శక్తుల పీచమణచడంపై కాకుండా పోలీసులు పచ్చ నేతల సేవలో తరిస్తుండటంతోనే ఈ దుస్థితి దాపురించిందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.


మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లకుండా అడ్డుకుంటున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

పెద్దారెడ్డిని పిలిచి మాట్లాడతా



శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందనే ఉద్దేశంతోనే మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రికి పంపించడం లేదు. పోలీసు రక్షణ కోసం ఆయన కోర్టుకు వెళ్లి ఉన్నారు. కోర్టు తీర్పు కోసం వేచి చూస్తున్నాం. అయినా ఆయనను పిలిచి మాట్లాడతా. సమస్య పరిష్కారమయ్యేలా చూస్తా.

–జగదీష్, ఎస్పీ

తాడిపత్రి వెళ్లాలంటే వీసా తీసుకోవాలా?

• మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ధ్వజం

యల్లనూరు: తాను తాడిపత్రికి వెళ్లాలంటే వీసా కావాలేమో చెబితే దరఖాస్తు చేసుకుంటానని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విమర్శించారు. సోమవారం యల్లనూరు మండలంలోని తన స్వగ్రామం తిమ్మంపల్లి నుంచి తాడిపత్రికి బయల్దేరుతున్న సమయంలో పోలీసులు పెద్ద సంఖ్యలో గ్రామానికి చేరుకొని ఆయనను అడ్డుకున్నారు. తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి, అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లుతో పాటు 10 మంది సీఐలు, 15 మంది ఎస్‌ఐలు, 25 మంది ఏఆర్ పోలీసులు, 20 మంది స్పెషల్ పార్టీ, పోలీసులు 100 మంది గ్రామంలో మోహరించారు. కేతిరెడ్డి పెద్దారెడ్డిని హౌస్ అరెస్ట్ చేసి బయటకు రాకూడదంటూ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి మాట్లాడుతూ తాడిపత్రిలోని తన ఇంటికి కూడా వెళ్లనీయకపోవడం అన్యాయమన్నారు. వేరే దేశానికి వెళ్లాలంటే వీసా తీసుకోవాల్సి ఉంటుందని, అలా తాడిపత్రికి వెళ్లాలంటే కూడా వీసా తీసుకోవాలని చెబితే అలాగే చేస్తానని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తాడిపత్రిలో జేసీ ప్రభాకర్‌రెడ్డి వసూళ్లకు తెరతీశారన్నారు. చిన్న బడ్డీ కొట్టు నుంచి షాపింగ్ కాంప్లెక్స్‌ల వరకు డబ్బు గుంజుతున్నారని ధ్వజమెత్తారు. అమాయక ప్రజలను బెదిరింపులకు గురి చేస్తూ భయానక వాతావరణం సృష్టిస్తున్నారన్నారు. తాను తాడిపత్రికి వెళ్తే ఏ విధంగా శాంతిభద్రతల సమస్య వస్తుందో పోలీసులు చెప్పాలని కోరారు. తనను నమ్మి 80 వేల మంది తాడిపత్రి నియోజకవర్గ ప్రజలు ఓట్లు వేశారని, వారి బాగోగులు చూసేందుకైనా తాను పట్టణానికి వెళ్లాల్సి ఉందన్నారు. తాడిపత్రిలో పోలీసు వ్యవస్థ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తోందంటూ దుయ్యబట్టారు. ఊర్లో గ్రామ దేవతకు దున్నపోతులను వదిలినట్లు జేసీ ప్రభాకర్ రెడ్డి కొంత మందిని వదిలారని మండిపడ్డారు. వాళ్లు రెచ్చగొడితే తాను రెచ్చిపోనని, కచ్చితంగా ఏదో ఒక రోజు తాడిపత్రికి వెళ్లి తీరతానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొడ్డుమర్రి ఈశ్వరరెడ్డి, యల్లనూరు సుబ్బయ్య, కిరణ్, కల్లూరు సూరి, దంతలపల్లి బాలవెంకటరెడ్డి, కొత్తపల్లి పురుషోత్తంనాయుడు, కూచివారిపల్లి సర్పంచ్ నారాయణ స్వామి, మెడికుర్తి సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వెంకట్రామిరెడ్డి, వెంకటాంపల్లి శంకర్ రెడ్డి, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

హంద్రీనీవా లైనింగ్ పనులు అడ్డుకుంటాం

• కుప్పంకు నీరు తీసుకెళ్లేందుకు చంద్రబాబు ఎత్తులు
• వైఎస్సార్ సీపీ రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: హంద్రీనీవా సంరక్షణ సమితి ఏర్పాటు చేయడంతో పాటు ఆయకట్టు రైతులతో సంఘాలు ఏర్పాటు చేసి లైనింగ్ పనులను అడ్డుకుంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో టీడీపీకి నిధులు సమకూర్చిన ఆర్‌వీఆర్, బీఎస్ఆర్, ఎస్ఆర్‌సీ కంపెనీలు సంపాదించుకోవాలంటే హైవే పనులు చేసుకోవాలని, లైనింగ్ పనులు చేస్తే మాత్రం ప్రాణాలు ఒడ్డయినా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. కుప్పంకు నీరు తీసుకెళ్లడానికి సీఎం చంద్రబాబు ఎత్తులు వేస్తున్నారన్నారు. దివంగత నేత వైఎస్సార్ చలువతో హంద్రీ–నీవాలో నీరు పరుగులు పెట్టడంతో గతంలో కూలీలుగా ఉన్న వారు నేడు రైతులుగా స్థిరపడ్డారన్నారు. ముందుగా ఆయకట్టు వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు బ్రాంచ్ కాలువ, డిస్ట్రిబ్యూటరీలు, మైనర్లు, సబ్ మైనర్లు ఏర్పాటు చేసి ప్రతి ఎకరాకు నీరు ఇచ్చే కార్యక్రమాన్ని తలపెట్టి, చివరి ఆయకట్టుకు నీరు రాకపోతే లైనింగ్ పనులు చేస్తారనీ.. కానీ, చంద్రబాబు మాత్రం అందుకు విరుద్ధంగా రైతుల పొట్ట కొట్టేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. హంద్రీనీవా డీపీఆర్‌లో గవర్నర్ ఆమోదంతో రూపొందించిన ఓ అగ్రిమెంట్‌ను చంద్రబాబు ఉల్లంఘిస్తున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 10 శాతం కమీషన్ చంద్రబాబు, మరో 10 శాతం ఎమ్మెల్యేలు తీసుకునేందుకు సిద్ధపడి జిల్లా రైతులను ఎండబెట్టాలని చూస్తున్నారని వాపోయారు. లైనింగ్ పనులతో హిందూపురంలో 300 గ్రామాలు, రాప్తాడులో 100 గ్రామాల ప్రజలు తీవ్రంగా నష్టపోతారన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో చిత్తూరు జిల్లాకు నీరివ్వాలని గాలేరు నగరి (వైఎస్సార్ జిల్లా) నుంచి రాయచోటి నియోజకవర్గం మీదుగా పుంగనూరు బ్రాంచ్ కాలువకు రూ.3,500 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ తీసుకువచ్చారని, ఇప్పటికే రూ.1,500 కోట్ల పనులు పూర్తయ్యాయన్నారు. హంద్రీనీవా లైనింగ్ పనులకు ఖర్చు చేసే రూ.1,000 కోట్లు అక్కడ ఖర్చు చేస్తే చిత్తూరు, వైఎస్సార్ జిల్లాలకు 80 టీఎంసీల నీరు అందుతాయన్నారు.

మంత్రి పయ్యావులకు తగునా?

'హంద్రీ–నీవా మొదటి దశలో ప్రధాన కాలువను వెడల్పు చేసుకుంటున్నారు. ఎందుకయ్యా మంత్రి పయ్యావుల.. హిందూపురంపై శీతకన్ను' అని ప్రకాష్ రెడ్డి ప్రశ్నించారు. ఎమ్మెల్యే పరిటాల సునీతకు కమీషన్ వస్తే చాలని, రైతుల ప్రయోజనాలు అవసరం లేదని దుయ్యబట్టారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 మంది ఎమ్మెల్యేలు ఇప్పటికైనా మేలుకుని లైనింగ్ పనులు జరగకుండా అడ్డుకోవాలని హితవు పలికారు. రైతులు తిరగబడితే ప్రభుత్వాలే కూలిపోయాయని ఆయన గుర్తు చేశారు. సమావేశంలో కామారుపల్లి సర్పంచ్ లోకనాథ్ రెడ్డి, రూరల్ జెడ్పీటీసీ చంద్రకుమార్, రాప్తాడు కన్వీనర్ సాకే వెంకటేష్, రామగిరి మండల కన్వీనర్ మీనుగ నాగరాజు, పాపంపేట మాదన్న, బీయాలేరు మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టుల్లో అర్హులకు అన్యాయం

• కలెక్టర్ వినోద్‌కుమార్‌కు దివ్యాంగుల ఫిర్యాదు
• 'పరిష్కార వేదిక'కు 418 వినతులు


దివ్యాంగుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో అర్హులకు అన్యాయం జరిగిందని, సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు దివ్యాంగులు విన్నవించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూభవన్ కింద ఉన్న దివ్యాంగుల వద్దకు కలెక్టర్ స్వయంగా వచ్చి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న మాట్లాడుతూ బ్యాక్‌లాగ్ పోస్టుల్లో కొందరు నకిలీ ధ్రువపత్రాలు సమర్పించినట్లు అధికారుల విచారణలో వెల్లడైందని, ఇందుకు కారకులైన వారిపై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని చెప్పారు. కాగా, 'పరిష్కార వేదిక'లో కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్‌ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, తిప్పే నాయక్, శిరీష, జిల్లా వ్యవసాయాధికారి ఉమా మహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 418 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపించాలని ఆదేశించారు.

వినతుల్లో కొన్ని...

• తమ భూమిపై వేరొకరికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారని మనోహర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. కంబదూరు మండలం ములకనూరు గ్రామ పొలం సర్వే నంబరు 781లో తమకు 16.48 ఎకరాల భూమి ఉందన్నారు. అయితే ఈ భూమిని ముగ్గురు వ్యక్తుల పేరున అక్రమంగా ఆన్‌లైన్‌లో ఎక్కించడంతో పాటు పాసు పుస్తకాలు ఇచ్చారని చెప్పారు. విచారణ చేయించి న్యాయం చేయాలని కోరారు.

• తమ భూమిని ఆక్రమించారని గార్లదిన్నె మండలం కనంపల్లికి చెందిన లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 370లో 3.51 ఎకరాలు, 372–3బీలో 1.14 ఎకరాలు మొత్తం 4.65 ఎకరాలు ఉందన్నారు. ఇందులో 2.65 ఎకరాలను ఆక్రమించారన్నారు. సర్వే కోసం చలానా కట్టినా అధికారులు సర్వే చేయడం లేదని చెప్పారు. న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

5న హార్టికల్చర్ కాంక్లేవ్

• కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం సెంట్రల్: అనంతపురం బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ కన్వెన్షన్ హాలులో ఈ నెల 5న 'అనంత' ఉద్యాన సమ్మేళనం (హార్టికల్చర్ కాంక్లేవ్) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. సోమవారం రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంక్లేవ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ కార్యక్రమం జరుగుతుందన్నారు. రాబోయే ఐదు సంవత్సరాల్లో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, శాస్త్రవేత్తలు, హార్టికల్చర్ యూనివర్సిటీల వైస్ చాన్సలర్‌లతో పాటు 16 మంది దేశ, విదేశాలకు చెందిన కార్పొరేట్ ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఐటీసీ, స్విగ్గీ, జొమాటో, రిలయన్స్, మైక్రో అగ్రి సొల్యూషన్స్, నెటా ఫిమ్ ఇరిగేషన్, ఆగ్రో లైఫ్ స్టైల్ కార్పొరేషన్, కోరమాండల్ ఇంటర్నేషనల్, జీఎం పవర్ సిస్టం, ఫసల్ లాంటి సంస్థలతో పాటు 64 జాతీయ స్థాయి కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా 6 ఎంఓయూలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్వో మలోల, హార్టికల్చర్ డీడీ నరసింహారావు, వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, డీటీడబ్ల్యూ రామాంజనేయులు, హార్టికల్చర్ అధికారి పల్లవి తదితరులు పాల్గొన్నారు.

'పచ్చ' కుట్రకే పురం పీఠం


మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దీపిక, నాయకులు

• మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో టీడీపీ అడ్డదారులు
• దగ్గరుండి ప్రలోభ రాజకీయం నడిపిన ఎమ్మెల్యే బాలకృష్ణ
• అధికారానికే అండగా నిలిచిన యంత్రాంగం

సాక్షి, పుట్టపర్తి/హిందూపురం: ఫిరాయింపు రాజకీయం తమకు కొత్త కాదని టీడీపీ మరోసారి రుజువు చేసింది. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులను సంతలో పశువులు కొన్నట్లు కొనడం తమకే సాధ్యమని నిరూపించింది. అధికారం అండతో చైర్మన్ పీఠం దక్కించుకుంది.

క్యాంపు నుంచి నేరుగా కౌన్సిల్‌కు...

హిందూపురం మున్సిపల్ చైర్మన్ స్థానం కోసం సోమవారం జరిగిన ఎన్నికలో అధికార టీడీపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది. ఆరుగురు సభ్యులతో చైర్మన్ పీఠం కోసం పోటీ పడిన టీడీపీ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ముఖ్యంగా సీఎం బావమరిది, స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ చైర్మన్ ఎన్నికలో అన్నీతానై నడిపించారు. అప్పటికే తమవైపు లాక్కున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లతో పాటు టీడీపీ, ఎంఐఎం, బీజేపీ కౌన్సిలర్లను ఐదురోజుల ముందే క్యాంప్‌నకు తరలించారు. సోమవారం ఉదయం సరిగ్గా ఎన్నిక సమయానికి కౌన్సిల్‌కు తీసుకువచ్చారు. అంతేకాకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం అధికారులపై ఒత్తిడి తెచ్చి వైఎస్సార్‌సీపీ విప్ కూడా పరిగణనలోకి తీసుకోకుండా అడ్డుకుంటూ కుట్రలు చేశారు.

టీడీపీ గెలిచిందిలా..

సోమవారం జరిగిన చైర్మన్ ఎన్నికలో టీడీపీ తరపున 6వ వార్డుకు చెందిన డీఈ రమేష్ బరిలో నిలవగా, వైఎస్సార్ సీపీ 3వ వార్డు కౌన్సిలర్ లక్ష్మిని పోటీలో నిలిపింది. ఎన్నిక ప్రారంభించగానే టీడీపీ సభ్యులు ఆరుగురు, బీజేపీ, ఎంఐఎం అభ్యర్థితో పాటు వైఎస్సార్ సీపీ నుంచి ఫిరాయించిన మరో 13 మంది కౌన్సిలర్లు టీడీపీ అభ్యర్థి రమేష్‌కు మద్దతు తెలిపారు. అలాగే ఎక్స్ అఫీషియో సభ్యుల హోదాలో ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే బాలకృష్ణ కూడా మద్దతు తెలపగా టీడీపీ అభ్యర్థి రమేష్‌కు 23 ఓట్లు వచ్చాయి. పార్టీ ఫిరాయింపుదారులు పోగా వైఎస్సార్ సీపీకి 17 మంది కౌన్సిలర్లు ఉండగా.... ఎన్నికకు ఇద్దరు గైర్హాజరయ్యారు. మరో కౌన్సిలర్ ఆలస్యంగా వచ్చి ఓటు వేసినా.. చెల్లదని అధికారులు ప్రకటించారు. దీంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి లక్ష్మికి 14 ఓట్లు పోల్ కాగా, టీడీపీ అభ్యర్థి డీఈ రమేష్ చైర్మన్‌గా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీఓ ఆనంద్‌కుమార్ ప్రకటించారు.

అధికారానికి తలొగ్గిన యంత్రాంగం..

హిందూపురం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా యంత్రాంగమంతా అధికార పార్టీకి తలొగ్గింది. పోలీసులు ఆదివారం సాయంత్రానికే పట్టణాన్ని ఆధీనంలోకి తీసుకున్నారు. సోమవారం పట్టణంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు చేశారు. సోమవారం ఉదయం ముందుగానే మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న పోలీసులు మున్సిపల్ కార్యాలయం వైపు ఎవరూ వెళ్లకుండా కట్టడి చేశారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లతో పాటు నాయకులు రాగా... గేటు వద్దే నాయకులను నిలిపివేశారు. చివరకు మీడియా ప్రతినిధులను సైతం కౌన్సిల్ హాలు వరకు వెళ్లకుండా అడ్డుకున్నారు. కానీ టీడీపీ కౌన్సిలర్ల వెంట ఆ పార్టీ నాయకులు, ఎమ్మెల్యే, ఎంపీ పీఏలు వెళ్తున్నా..ఏ మాత్రం అడ్డుచెప్పలేకపోయారు. అనుమతిలేని వారులోనికి ప్రవేశించరాదని అప్పటి వరకూ హంగామా చేసిన పోలీసులు...టీడీపీ నేతలకు వంగి వంగి సలాములు చేయడం చూసి జనం తప్పుపట్టారు.


ఇరుపార్టీల కౌన్సిలర్ల మధ్య బారికేడ్లు ఏర్పాటు చేసి కూర్చోబెట్టిన దృశ్యం


రమేష్‌కు డిక్లరేషన్ ఇస్తున్న ప్రిసైడింగ్ అధికారి ఆనంద్‌కుమార్

ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలింపు సరికాదు

- కలెక్టర్‌కు వైఎస్సార్‌సీపీ పీఆర్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస వినతి


కలెక్టర్ వినోద్‌కుమార్‌కు సమస్య వివరిస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

అనంతపురం అర్బన్: వైఎస్సార్ జిల్లా కడపలో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ (ఏపీజీబీ) ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించే ప్రయత్నాన్ని మానుకోవాలని కూటమి సర్కార్‌ను వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతి పత్రాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు సోమవారం ఆయన అందజేసి, మాట్లాడారు. ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించడం ద్వారా రాయలసీమకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. గతంలో ఎయిమ్స్‌ను మంగళగిరికి తరలించారని, కడప కొప్పర్తి ఎమ్ఎస్ఎంఈ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి కల్పించారని... ఈ చర్యల ద్వారా రాయలసీమ ప్రాంతానికి నష్టం జరుగుతోందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు, రైతులకు ఎన్నో విశిష్ట సేవలందిస్తూ రాయలసీమలో ఏపీజీబీ ప్రధాన భూమిక పోషిస్తోందన్నారు. ఈ బ్యాంక్ కార్యాలయాన్ని అమరావతికి తరలించాలనే నిర్ణయం సరైంది కాదన్నారు. ఈ చర్యను తక్షణం ఉపసంహరించుకోవాలన్న తమ డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

హెచ్చెల్సీ డిస్ట్రిబ్యూటరీలో మృతదేహం

బొమ్మనహాళ్: మండలంలోని దేవగిరి క్రాస్ శివారున హెచ్చెల్సీ 1వ డిస్ట్రిబ్యూటరీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మూడు రోజుల క్రితం స్థానిక రైతులు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు, లస్కర్లకు తెలిపినా వారు పట్టించుకోకపోవడంతో మృతదేహం కుళ్లి దుర్వాసన వెదజల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం పోలీసులు అటుగా వచ్చి పరిశీలించి వెళ్లారన్నారు. అయినా మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించకుండా నిర్లక్ష్యంగా ఉండిపోయారన్నారు. హెచ్చెల్సీ ప్రధాన కాలువ నుంచి 1వ డిస్ట్రిబ్యూటరీకు నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున మృతదేహం దేవగిరి క్రాస్- దేవగిరి గ్రామ శివారు వరకు వారం రోజుల క్రితం కొట్టుకొచ్చినట్టుగా ఉందన్నారు. మృతదేహంపై ఎలాంటి దుస్తులు లేవని కేవలం డ్రాయర్ మాత్రమే ఉందని, మృతుడికి 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉండవచ్చునని పేర్కొన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి మృతదేహాన్ని అక్కడి నుంచి తొలగించాలని రైతులు కోరారు.

ప్రభుత్వానికి కనువిప్పు కలగాలి

- మార్చి 12న ఫీజుపోరుకు సిద్ధం
- వైఎస్సార్‌సీపీ జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్
- మద్దతు తెలిపిన ఐక్య విద్యార్థి సంఘాలు


రమేష్ గౌడ్‌తో కలసి ఫీజు పోరుకు సంఘీభావం తెలుపుతున్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం కార్పొరేషన్: విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా ఐక్య పోరాటాలకు సిద్ధమవుతామంటూ వైఎస్సార్ టాస్క్‌ఫోర్స్ సభ్యులు రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు మార్చి 12న తలపెట్టిన ఫీజు పోరును విజయవంతం చేసేలా అన్ని విద్యార్థి సంఘాలను కలుపుకుని ముందుకు పోతున్నామన్నారు. జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఐక్య విద్యార్థి సంఘాల నాయకులతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

నాడు పారదర్శకంగా బకాయిల చెల్లింపులు

గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో బకాయి ఉన్న రూ.1,780 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాగానే పారదర్శకంగా అందించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలవుతున్నా ఇంత వరకూ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయలేదన్నారు. దీంతో బకాయిలు చెల్లించాలంటూ విద్యార్థులపై కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఒత్తిడి చేస్తున్నాయన్నారు. ఫీజులు చెల్లించలేని స్థితిలో విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం వద్దంటూ తెలుగు మహాసభల్లో కూటమి నేతలు, మేధావులని చెప్పుకునే కొందరు ప్రముఖులు మాట్లాడారన్నారు. తెలుగు ముద్దు అంటూనే.. స్వయానా రామోజీ కోడలు శైలజా కిరణ్ నడుపుతున్న రమాదేవి పబ్లిక్ స్కూల్‌లో తెలుగు పాఠ్యాంశం లేకుండా జర్మన్, ఫ్రెంచ్, రష్యన్ సబ్జెక్ట్‌లతో నడుపుతున్న విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బెస్త వెంకటేష్, చంద్ర, నరసింహులు, నాగేంద్ర, లబ్బే రాఘవ, వంశీ, మోహన్, గణేష్, మారుతీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై మానసిక ఒత్తిడి



జిల్లాలోని బీసీ వసతి గృహాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఉర్దూ వసతి గృహాల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు వసతులు కల్పించాలి. ప్రధానంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో విద్యార్థులను కళాశాలల యాజమాన్యాలు మానసిక ఒత్తిళ్లకు గురి చేస్తున్నాయి. ప్రభుత్వం తక్షణం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి.
– కేశవ, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు

విద్యార్థులకు అండగా నిలుస్తాం



విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో చెల్లించకుండా ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. కూటమి ప్రభుత్వం అనైతిక వైఖరిని నిరసిస్తూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మార్చి 12న తలపెట్టిన ఫీజు పోరును జయప్రదం చేద్దాం. విద్యార్థులకు అండగా నిలుద్దాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసేంత వరకూ పోరాడుతాం.
– చంద్రశేఖర్ యాదవ్, వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు

బకాయిలు విడుదల చేయాలి



విద్యార్థుల ఫీజు బకాయిలను కూటమి ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. మార్చి 12 జరిగే ఫీజు పోరుకు మేము సంపూర్ణ మద్దతునిస్తున్నాం. ఇప్పటికే గిరిజన విద్యార్థులను చైతన్యం చేశాం. ఫీజు పోరులో ముందుండి కదం తొక్కుతాం.
– మల్లికార్జున నాయక్, గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు

లోకేష్‌వన్నీ బూటకపు హామీలు



విద్యార్థులకు అండగా ఉంటామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఆర్భాటంగా ప్రకటించారు. అయితే ఇది కేవలం ఉత్తరకుమారుడి ప్రగల్భాలుగానే మిగిలిపోయాయి. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు చెల్లిస్తామన్నారు. ఇవాళ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా మంత్రి నారా లోకేష్ కాలయాపన చేస్తున్నారు. లోకేష్‌వన్నీ బూటకపు హామీలేనని తేలిపోయింది.
– పృథ్వీ, ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి

జయప్రదం చేద్దాం



విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని వైఎస్సార్‌సీపీ మార్చి 12న తలపెట్టిన ఫీజు పోరును జయప్రదం చేద్దాం. విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలిరావాలి. ఫీజు పోరుకు మేము పూర్తిగా మద్దతిస్తున్నాం. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మంత్రి నారా లోకేష్ విఫలమయ్యారు.
– జెన్నే చిరంజీవి, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించని ప్రభుత్వానికి సరైన బుద్ధి చెబుతాం. విద్యార్థుల పట్ల ప్రభుత్వం చులకన భావంతో ఉంది. ఎన్నికలకు ముందు ఒక మాట...అధికారంలోకి వచ్చాక మరో మాట మాట్లాడడం సరి కాదు. ఫీజు పోరుకు విద్యార్థి లోకం తరలిరావాలి.
– నరేంద్ర, పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు

అన్న చెప్పాడు.. చదును చేస్తున్నాం!

- ధర్మవరపు మురళి పేరుతో పేదల భూముల్లో 'తమ్ముళ్ల' దౌర్జన్యం
- అధికారులను ఉసిగొల్పిన పచ్చనేత
- యంత్రాలను పెట్టి చదును చేయిస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు


రైతులతో వాగ్వాదం చేస్తున్న సీఐ, తహసీల్దార్

సాక్షి, టాస్క్‌ఫోర్స్: దశాబ్దాలుగా పేదల అనుభవంలో ఉన్న వంక పొరంబోకు భూమిని కబ్జా చేసేందుకు టీడీపీ నేతలు పావులు కదిపారు. ఈ క్రమంలో సోమవారం ఏకంగా జేసీబీని ఏర్పాటు చేసి పచ్చని మామిడి చెట్లను, పక్కా గృహాలను కూలదోసే ప్రయత్నం చేపట్టారు. స్థానికులు తిరగబడడంతో అప్పటికప్పుడు పలాయనం చిత్తగించినా... గంటల వ్యవధిలోనే పోలీసులు, రెవెన్యూ అధికారులతో కలసి అక్కడకు చేరుకుని తమ పని చక్కపెట్టుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

50 ఏళ్లుగా పేదల అనుభవంలో

రాప్తాడు శివారున ఉన్న పండమేరు వంక సమీపంలోని సర్వే నంబర్ 226లో 15 ఎకరాలకు సంబంధించి పలువురు రైతులు 50 ఏళ్ల క్రితమే ప్రభుత్వం ద్వారా డీ-పట్టాలు పొంది పంటల సాగుతో జీవనం సాగిస్తున్నారు. పట్టాలు పొందిన రైతులు మామిడి, గడ్డి సాగు, నేరేడు, జామ, వరి సాగు, జొన్న, ఫారం గడ్డి, తదితర పంటలు సాగుచేస్తున్నారు. మరి కొందరు పంటలు పెట్టుకునే ఆర్థిక స్తోమత లేక బీడు పెట్టారు. అలాగే దాదాపు 200 మంది పక్కా గృహాలు నిర్మించుకుని ఏళ్ల తరబడి అక్కడే జీవనం సాగిస్తున్నారు. వీరందరూ వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులు కావడంతో ఆ భూమిపై కన్నేసిన టీడీపీ నేతలు... ఎలాగైనా చేజిక్కించుకోవాలని 8 నెలలుగా పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలో సోమవారం ఏకంగా జేసీబీని ఏర్పాటు చేసి నారాయణస్వామి తోటలోని మామిడి చెట్లను పీకేందుకు సిద్ధమయ్యారు. వెంటనే స్థానికులు గుమిగూడి అడ్డుకున్నారు. ఆ సమయంలో ధర్మవరపు మురళి (ఎమ్మెల్యే పరిటాల సునీత సోదరుడు) పేరు చెప్పి బెదిరింపులకు దిగారు. 'అన్న చెప్పాడు... మేము చదును చేయిస్తున్నాం. ఏదైనా ఉంటే అన్నతో మాట్లాడుకోండి' అంటూ దౌర్జన్యం చేయబోయారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, రాప్తాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వెంటనే స్పందించి, రెవెన్యూ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పేదల భూముల జోలికి వెళితే ఊరుకునేది లేదన్నారు. విషయాన్ని వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, నాయకులు సాకే చంద్ర, జయన్నకు తెలిపి, అక్కడకెళ్లి బాధిత రైతులకు అండగా నిలవాలని ఆదేశించారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కడకు చేరుకుని రైతులతో కలసి పనులను అడ్డుకోవడంతో జేసీబీ డ్రైవర్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

చెట్లను తొలగించాల్సిందే..

విషయం తెలుసుకున్న ధర్మవరపు మురళీ... పోలీసులు, రెవెన్యూ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇప్పుడున్నది మన ప్రభుత్వమని, ఇతర పనులు మానుకొనైనా వెంటనే అక్కడికెళ్లి మొత్తం స్థలాన్ని ఖాళీ చేయించి, చదును చేయించాలని ఆదేశించాడు. దీంతో తహసీల్దార్ విజయకుమారి, సీఐ శ్రీహర్ష, సిబ్బంది సోమవారం మధ్యాహ్నం జేసీబీతో అక్కడకు చేరుకుని బీడు భూమిలో ముళ్ల కంపలను తొలగించారు. దీంతో మళ్లీ రైతులు పనులను అడ్డుకున్నారు. ఆ సమయంలో తహసీల్దార్, సీఐ ఆగ్రహం వ్యక్తం చేస్తూ పనులు అడ్డుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్క్‌ను ఏర్పాటు చేసేందుకు క్లీన్ చేస్తున్నామని బుకాయించారు. చెట్లు కానీ ఇల్లు కానీ తొలగించడం లేదని, సర్వే నంబర్ 226లో దాదాపు 15 ఎకరాల పొరంబోకు స్థలాన్ని మాత్రమే స్వాధీనం చేసుకుంటున్నట్లు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. నోటీసులు ఇవ్వకుండా ఎలా చదును చేస్తారంటూ రైతులు నిలదీశారు. తమ ఆధీనంలోని భూమికి సంబంధించిన ఆధారాలు చూపుతామని, తమకు రెండు రోజుల గడువు ఇవ్వాలని రైతులు కోరారు. అయినా స్థలాన్ని చదును చేయడానికి ఆరు రోజుల సమయం పడుతుందని, ఈ పనులు కొనసాగుతూ ఉంటాయని, ఈ లోపు డాక్యుమెంట్లను తెచ్చి చూపించాలని తహసీల్దార్ పేర్కొన్నారు. పార్క్ ఏర్పాటు పేరుతో పేదల భూములను స్వాధీనం చేసుకోవడం సబబు కాదని, భూములు కోల్పోతే తమకు ఆత్మహత్య తప్ప మరో మార్గం లేదని పలువురు రైతులు బోరున విలపించినా అధికారులు కనికరించలేదు. టీడీపీ నేతల దౌర్జన్యం నుంచి తమ ఆస్తులకు రక్షణ కల్పించాలని వేడుకుంటున్నారు.

చీనీ చెట్లు దగ్ధం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఇటుకపల్లిలో రైతు మాధవరాజుకు చెందిన చీనీ తోటలో రెండు రోజుల కిందట 150 చెట్లు దగ్ధమయ్యాయి. సోమవారం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వేణుగోపాల్‌తో కలసి రూరల్ మండల తహసీల్దార్ మోహన్‌కుమార్‌కు బాధిత రైతు ఫిర్యాదు చేశాడు. ఆరు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని 11 ఏళ్ల కిందట 500 చీనీచెట్లు సాగు చేశాడు. ఏడేళ్లగా దిగుబడి తీసుకుంటున్నాడు. ఈసారి కూడా చెట్లను కాపునకు వదిలాడు. పిందెలు ఏర్పడ్డాయి. ఆదివారం ఆకతాయిలు గడ్డికి నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి 150 చెట్లు పూర్తిగా కాలిపోయాయి. ఘటనపై సర్వే చేయించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

వివాహిత బలవన్మరణం


మృతురాలు జయంతి

రాయదుర్గం టౌన్: ఇష్టం లేని పెళ్లి చేయడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. వివరాలు... రాయదుర్గం మండలం టి.వీరాపురం గ్రామానికి చెందిన చాకలి సుంకన్న, నాగమ్మ దంపతుల కుమార్తె జయంతి (21)కి మూడు నెలల క్రితం రాయదుర్గం మండలం కదరంపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌తో వివాహమైంది. పెళ్లైన 15 రోజుల తర్వాత పుట్టింటికి చేరుకున్న ఆమె తిరిగి కాపురానికి వెళ్లలేదు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మానసిక స్థితి సరిగా లేక ఆత్మహత్య చేసుకున్నటులగా బంధువులు చెబుతున్నా... జయంతికి ఇష్టం లేకపోయినా సొంత మేనమామతో పెళ్లి చేయడంతో జీవితంపై విరక్తి పెంచుకుని ఈ దారుణానికి ఒడిగట్టినట్లుగా సమాచారం. ఘటనపై మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సీఐ జయానాయక్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

- **యాడికి:** యాడికి మండలం నిట్టూరుకు చెందిన చాకలి వెంకటరాముడు (48) ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం పెద్దపేట సమీపంలో రోడ్డు పక్కన పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండడంతో గమనించిన స్థానికులు వెంటనే యాడికిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చట్ట పరిధిలో న్యాయం చేకూరుస్తాం : ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితులు అందజేసిన అర్జీలకు చట్ట పరిధిలో న్యాయం చేకూరుస్తామని ఎస్పీ పి.జగదీష్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వేదిక కార్యక్రమంలో పలువురి నుంచి ఆయన అర్జీలు స్వీకరించి, మాట్లాడారు. సమస్య తీవ్రతను సంబంధిత పోలీసు అధికారులకు తెలిపి పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డీవీ రమణ మూర్తి, డీఎస్పీ ఎస్.మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

10వ తరగతి విద్యార్థి అదృశ్యం


మనోజ్

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం పాములరాయి సమీపంలో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి కె. మనోజ్ కనిపించకుండా పోయాడు. హాస్టల్‌లో ఉంటున్న మనోజ్ సోమవారం ఉదయం 9 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా పాఠశాల నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోయే సరికి యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం తాటిమాకులపల్లి గ్రామానికి చెందిన తండ్రి కృష్ణమూర్తి ఆ పాఠశాలకు చేరుకుని స్నేహితులను ఆరా తీశారు. చుట్టుపక్కల గ్రామాల్లో గాలింపు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మంగళవారం ఫిర్యాదు చేయడంతో రూరల్ పీఎస్ పోలీసులు కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు.

నిధులను సద్వినియోగం చేసుకుందాం : డీఆర్‌ఎం

గుంతకల్లు: బడ్జెట్‌లో గుంతకల్లు డివిజన్‌కు కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకుంటామని డీఆర్‌ఎం సి.చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం డివిజన్‌లో చేపట్టి డబ్లింగ్ రైలు మార్గాలకు నిధుల కేటాయింపులు జరిగాయన్నారు. రైలు ప్రమాదాల నివారణలో భాగంగా 'కవచ్'కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తామన్నారు. అమృత్ భారత్ కార్యక్రమం కింద 73 రైల్వేస్టేషన్లను ఆధునీకరించేందుకు రూ.2,051 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. డివిజన్ల వారీగా పూర్తి స్థాయి కేటాయింపుల వివరాలు పింక్ బుక్ ద్వారా త్వరలో తెలుస్తాయన్నారు. అంతకుముందు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధాకర్, సీనియర్ డీసీఎం మనోజ్, గతి శక్తి చీఫ్ ప్రాజెక్టు మేనజర్ బీమారెడ్డి రామకృష్ణ, సీనియర్ డీఓఎం శ్రావణ్‌కుమార్, సీనియర్ డీఎఫ్‌ఎం పీవీ రామకృష్ణ, సీనియర్ డీఎస్‌టీఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సందడిగా వాకథాన్ : విద్యుత్ రైలు పరుగులు పెట్టి వందేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం డీఆర్‌ఎం కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు వాకథాన్ సందడిగా సాగింది. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ గుంతకల్లు డివిజన్ వ్యాప్తంగా వందశాతం విద్యుదీకరణ పూర్తి చేసినట్లు తెలిపారు. 130 కి.మీల వేగం నుంచి 150 కి.మీ వేగంతో రైళ్ల పరుగులు పెడుతున్నాయన్నారు. త్వరలో హైస్పీడ్ రైళ్లు అందుబాటులోకి వస్తున్నాయన్నారు.

భర్త మందలింపు... భార్య ఆత్మహత్య

అనంతపురం: సెల్‌ఫోన్ కొనుగోలు చేసిన భార్యను అనుమానంతో భర్త మందలించడంతో క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని నాల్గో రోడ్డులో నివాసముంటున్న లక్ష్మీనారాయణ కుమారుడు పవన్‌కుమార్‌కు శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలం హేమావతి గ్రామానికి చెందిన రంజిత (30)తో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఐదేళ్ల వయసున్న కుమారుడు ఉన్నాడు. పెళ్లిల్లో డెకరేషన్, లైటింగ్ పనితో పవన్‌కుమార్ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో భర్తకు తెలియకుండా ఇటీవల రంజిత రూ.15 వేలు ఖర్చు పెట్టి ఓ సెల్‌ఫోన్ కొనుగోలు చేసింది. విషయం తెలుసుకున్న పవన్‌కుమార్ తన భార్యను అనుమానిస్తూ మాట్లాడాడు. పెద్దలు జోక్యం చేసుకుని సర్దిచెప్పినా పవన్ తన వైఖరి మార్చుకోలేదు. దీంతో మనస్తాపం చెందిన రంజిత ఆదివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రంజిత తండ్రి రంగప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు మూడో పట్టణ సీఐ కె.శాంతిలాల్ తెలిపారు.

వెలిగొండ సర్పంచ్ ఇంటిపై రాళ్లతో దాడి

ఉరవకొండ: మండలంలోని వెలిగొండ గ్రామ సర్పంచ్ వీరాంజి ఇంటిపై అదే గ్రామానికి చెందిన పర్తప్ప కుటుంబసభ్యులు రాళ్లతో దాడి చేశారు. సర్పంచ్ సోదరుడు నాగప్ప కుమారుడు శివకుమార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... సోమవారం సర్పంచ్ వీరాంజి ఇంటి సమీపంలో ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఉంచిన విషయంగా అదే గ్రామానికి చెందిన గుడిసెల పర్తప్ప, చంద్రశేఖర్, నీలకంఠ, చెన్నకేశవులు, సుంకప్ప, సిద్దప్ప, సునీత, మంగమ్మ గొడవకు దిగి ఇంటిపైకి రాళ్లు రువ్వారు. ఘటనలో సర్పంచ్ వీరాంజి భార్య లక్ష్మీదేవికి బలమైన మూగదెబ్బలు తగిలాయి. గొడ్డళ్లతో దాడికి ప్రయత్నిస్తుంటే లక్ష్మీదేవి తప్పించుకుని పొలానికి వెళ్లి జరిగిన విషయాన్ని భర్త వీరాంజి, కుటుంబసభ్యులకు తెలిపింది. దీంతో వారు క్షతగాత్రురాలిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం ఘటనపై ఎస్ఐ జనార్దన్‌నాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలిచిన తనపై పథకం ప్రకారమే దాడికి తెగబడ్డారన్నారు.

కసాపురంలో నేడు రథసప్తమి వేడుక

గుంతకల్లు రూరల్: రథసప్తమి పర్వదినం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం సూర్యయంత్ర ఆరాధన, పాలు పొంగించుట, సూర్య నమస్కారాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ కె.వాణి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమాల అనంతరం సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై ప్రాకారోత్సవం నిర్వహించనున్నారు.

కార్యక్రమాలు చిత్తశుద్ధితో నిర్వహించాలి

అనంతపురం అర్బన్: ప్రజాశ్రేయస్సు ధ్యేయంగా చేపట్టిన కార్యక్రమాలు చిత్తశుద్ధితో నిర్వహించాలని అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నులిపురుగుల నిర్మూలన కార్యక్రమ, జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ, పాఠశాలల్లోని పిల్లలకు ఈనెల 10వ, 17వ తేదీల్లో ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని చెప్పారు. 'రహదారి భద్రత ప్రచారం- ప్రయాణంలో శ్రద్ధ వహించండి' కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలన్నారు. ట్రాఫిక్ నియమాలు, నిబంధనలపై అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్‌ఓ మలోల, డీఎంహెచ్ఓ ఈబీదేవి, అధికారులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీవారి రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

కుందుర్పి: మాఘ మాసాన్ని పురస్కరించుకుని కుందుర్పిలో వెలసిన లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం సోమవారం నేత్రపర్వంగా సాగింది. ఉదయం ఆలయంలో విశేష పూజలు, హోమాలు పెద్ద ఎత్తున సాగాయి. మధ్యాహ్నం బ్రహ్మ రథంపై శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీవేంకటేశ్వర స్వామి విగ్రహాలను అధిష్టింపజేసి వేలాది భక్తుల గోవింద నామస్మరణ నడుమ లాగారు. ప్రత్యేక పూజల్లో కళ్యాణదుర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సత్యనారాయణశాస్త్రి, స్థానిక సర్పంచ్ మారుతేశ్వరి, ఎంపీపీ కమలానాగరాజు, వైస్‌ఎంపీపీలు భీమిరెడ్డి, అజయ్‌బాబు, తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిప్పేస్వామి, ఐటీ వింగ్ అధ్యక్షుడు మద్రిస్వామి, సర్పంచులు గంగాధర, జగన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

'ఫీజు పోరు' జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపునిచ్చిన 'ఫీజు పోరు'ను జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు రూ.3,900 కోట్లు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. సకాలంలో ఫీజులు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. మార్చి 12వ తేదీన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్చెన్నెస్సెస్ లైనింగ్ పనులు ఆపాలి



మాట్లాడుతున్న జాఫర్

అనంతపురం అర్బన్: హంద్రీ–నీవా కాలువకు చేపట్టిన లైనింగ్ పనులు తక్షణమే ఆపాలని సీపీఐ డిమాండ్ చేసింది. సీపీఐ సహాయ కార్యదర్శి నారాయణస్వామి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున, వ్యకాసం జిల్లా కార్యదర్శి కేశవరెడ్డితో కలసి సోమవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదివేల క్యూసెక్కుల సామర్థ్యానికి హంద్రీ–నీవా కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ చేయడం సరికాదన్నారు. ఈ నేపథ్యంలో లైనింగ్ పనులు ఆపాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అనంతపురంలోని హెచ్చెన్నెస్సెస్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హాజరవుతారన్నారు.

వైద్య చికిత్సలపై అవగాహన అవసరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: వాతావరణ మార్పులతో వచ్చే సమస్యలకు సంబంధించి హీట్ వేవ్, హీట్ ఇండెక్స్, గ్రీన్‌హౌస్ గ్యాస్ ఎఫెక్ట్, అర్బన్ హీట్ ఐలాండ్ ఎఫెక్ట్, బిల్ట్ ఎన్విరాన్‌మెంట్‌పై ఎంఎల్‌హెచ్‌పీలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి ప్రారంభించారు. జాతీయ ఆరోగ్య మిషన్, స్వస్తి, గ్లోబల్ కన్సార్టియం ఆన్ క్లైమేట్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ (జీసీసీహెచ్ఈ) సహకారంతో ఏపీ ప్రభుత్వం పిలుపునిచ్చిన శిక్షణ కార్యక్రమం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం జరిగింది. వేడిగాలుల ద్వారా ఎదురయ్యే సమస్యలకు ఇవ్వాల్సిన చికిత్సలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో స్వస్తి లీడ్ నిమిషా హెర్రెరా నిమ్మగడ్డ, ప్రోగ్రాం అసోసియేట్ తన్మయి, ఎవిడెన్స్ స్పెషలిస్టు పవిత్ర, సీనియర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డీ పైవా, తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక చట్టాలను కాలరాస్తున్నారు'




మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్

అనంతపురం అర్బన్: కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ ధ్వజమెత్తారు. కేంద్రం ప్రవేశపెట్టి ప్రజావ్యతిరేక బడ్జెట్‌పై ఈనెల 5న చేపట్టనున్న దేశవ్యాప్త ఆందోళనలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సంఘం జిల్లా సమితి సమావేశానికి రవీంద్రనాథ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్‌లకు అనుకూలంగా పనిచేస్తూ కార్మికులకు అన్యాయం చేస్తున్నాయన్నారు. 44 కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్ తీసుకొచ్చి కార్మికులకు ద్రోహం చేసిందన్నారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు కృష్ణుడు, నాయకులు గోవిందు, నాగవేణి, శ్రీనివాసులు, చిరంజీవి, రాజు, శ్రీనివాసులు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మల్లా చేతి పంపులు

- పలు గ్రామాల్లో మరమ్మతుకు నోచుకోని వైనం
- పైప్‌లైన్ల లీకేజీతో నీరు వృథా
- సమీపిస్తున్న వేసవి కాలం
- పట్టించుకోని అధికారులు

'ఈ ఫొటోలో కనిపిస్తున్న చేతి పంపు ఆత్మకూరులోని భగత్‌సింగ్ కాలనీలో ఉంది. ఈ చేతి పంపులో సమృద్ధిగా నీరు వస్తున్నప్పటికీ చేతి పంపునకు చైన్ లేకపోవడంతో వృథాగా దర్శనమిస్తోంది. ఈ చేతి పంపునకు చైన్ వేసి మరమ్మతులు చేస్తే వేసవిలో ఆ కాలనీలో నీటి సమస్య తగ్గుతుంది.'



ఆత్మకూరు: ప్రస్తుతం వేసవి కాలం సమీపిస్తోంది. గతంలో గ్రామాల్లో ఎక్కడ చూసినా నీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొన్ని గ్రామాల్లో జలజీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ కుళాయి కార్యక్రమం ద్వారా నీటిని అందించారు. ప్రస్తుతం ఇంకా ఆ పనులు పలు గ్రామాల్లో కొనసాగుతున్నాయి. వేసవి కాలంలో గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మండల వ్యాప్తంగా 24 గ్రామాలు, 17 పంచాయతీలు ఉండగా.. దాదాపు 163 చేతి పంపులు ఉన్నాయి. 65 పంచాయతీ బోర్లు ఉన్నాయి. అదే విధంగా నూతనంగా నిర్మించిన వాటితో కలిపి 38 ఓవర్‌హెడ్ ట్యాంకులు, 40 వరకు మినీ ట్యాంకులు ఉన్నట్లు సమాచారం.

సమస్యలు పరిష్కారం అయ్యేనా ?

క్రాష్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం గ్రామాల్లో ఎక్కడైనా చేతి పంపులు మరమ్మతులకు గురి అయితే వాటిని పరిశీలించి మరమ్మతులు చేయించాలి. ఫిబ్రవరి 1వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమం.. 45 రోజుల పాటు కొనసాగుతుంది. ఈ కార్యక్రమానికి సంబంధించి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మండల పరిషత్‌లో 15వ ఆర్థిక సంఘంలో నిధులు ఉన్నాయి. ఈ నిధులతో నీటి సమస్యను పరిష్కరించడానికి ప్రజాప్రతినిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ అధికారులు మాత్రం ప్రజాప్రతినిధులకు సహకరించడం లేదంటూ పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. క్రాష్ కార్యక్రమం (బోర్ల పరిశీలన, మరమ్మతులు) ప్రారంభం అయినప్పటికీ ఇంత వరకూ అధికారులు తీర్మానాలు కూడా సిద్ధం చేయలేకపోయారు. ప్రజాప్రతినిధులు గత నెల రోజుల నుంచి తీర్మానాలు చేయాలని అధికారులను కోరినా.. అధికారులు పట్టించుకోవడం లేదు. అంతేకాకుండా చేతి పంపుల మరమ్మతులకు సంబంధించి ఇంత వరకు స్పేర్ పార్ట్స్ కూడా సమకూర్చుకోలేదు. గ్రామాల్లో, మండల కేంద్రంలో చాలా చోట్ల పైపులైన్ లీకేజీ సమస్యలు తలెత్తుతున్నాయి.



పైపులు పగిలిపోవడంతో లీకేజీ అవుతున్న నీరు

వాళ్లు చెబితేనే చేస్తాం..!

మండ వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో చేతి పంపులు చాలా వరకు మరమ్మతులకు గురయ్యాయి. ప్రస్తుతం ప్రారంభమైన క్రాష్ కార్యక్రమం (బోర్ల పరిశీలన, మరమ్మతులు)లో అయినా వాటికి మరమ్మతులు చేస్తారో లేదో తెలియడం లేదు. అధికారులు కూడా ఈ పనులు చేపట్టేందుకు సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. కొంత మంది ప్రజా ప్రతినిధులు పనులకు సంబంధించి తీర్మానాలు సిద్ధం చేయండి అని అధికారులను అడిగినా.. వాళ్లు చెబితేనే చేస్తాం (అధికార పార్టీ నేతలు) అని బహిరంగంగా చెబుతున్నట్లు సమాచారం. అధికార పార్టీ నేతలకు తెలియకుండా ఏదైనా తీర్మానాలు తయారు చేస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందేమో అని ఉద్యోగులు భయపడుతున్నారు. ప్రజల గొంతు తడిపేందుకు కూడా అధికార పార్టీ నేతల అనుమతి కావాలా అంటూ స్థానికులు మండిపడుతున్నారు.

తీర్మానాలు సిద్ధం చేయాలని చెప్పాం

త్వరలో వేసవి కాలం ప్రారంభం కానుంది. గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడకూడదని నెల రోజుల నుంచి తీర్మానాలు సిద్ధం చేయండి అని అధికారులకు చెబుతున్నాం. నేటికీ అధికారులు తీర్మానాలు సిద్ధం చేయలేదు. క్రాష్ కార్యక్రమంలో చేతి పంపులకు మరమ్మతులు చేయించాల్సి ఉంది. ఇందుకు సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

– హేమలత, ఎంపీపీ

సమస్యలు పరిష్కరిస్తాం

ప్రస్తుతం జరుగుతున్న క్రాష్ కార్యక్రమంలో భాగంగా దెబ్బతిన్న చేతి పంపులకు మరమ్మతులు చేయిస్తాం. ఇందుకు అవసరమైన మెటీరియల్ తెప్పిస్తాం. ఏయే గ్రామాల్లో చేతిపంపులను దెబ్బతిన్నాయో తెలుసుకుంటాం. మెకానిక్‌తో మాట్లాడి మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేయిస్తాం. ప్రతి గ్రామంలో పర్యటించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మీనరసింహ, ఎంపీడీఓ

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ప్రస్తుతం గ్రామాల్లో ఎక్కడా నీటి సమస్య లేదు. వేసవిలో ఒక వేళ నీటి సమస్య తలెత్తితే ట్రాక్టర్ల ద్వారా నీరు సరఫరా చేస్తాం. త్వరలోనే జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి ఏర్పాటు పనులు పూర్తవుతాయి. కుళాయిల ద్వారా స్వచ్ఛమైన నీరు అందిస్తాం. గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా తాగునీరు సరఫరా చేస్తాం.

– శివకుమార్, ఆర్‌డబ్ల్యూ ఏఈ

ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇవ్వాల్సిందే



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

అనంతపురం అర్బన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇవాల్సిందే అని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ర్యాపిడోను రద్దు చేసి, ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇవ్వాలనే డిమాండ్లతో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు సోమవారం ఆర్ట్స్ కళాశాల నుంచి ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్ వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు వెంకటనారాయణ, ముత్తూజ, గోపాల్, తదితరులు మాట్లాడారు. విద్యావంతులై ఉండి ఉద్యోగాలు దొరక్క ఆటోలు నడుపుకుంటూ ఆరకొర సంపాదనతో కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. ఇక ర్యాపిడో సంస్థ, ప్రైవేటు ఫైనాన్స్‌లు వారి జీవనోపాధిపై దెబ్బకొడుతున్నాయన్నారు. మరోవైపు పెట్రోల్, డీజిల్ ధరలు రోజురోజుకూ పెరుగుతుండడం మరింత భారంగా మారిందన్నారు. దీని తోడు పోలీసులు, ఆర్టీఓ అధికారుల దాడులతో మరింత ఇబ్బందిపడుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇలాంటి ఆటో కార్మికులను ఆదుకునే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఆటో కార్మికులకు రూ.15 వేలు ఇస్తామని, ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచినా హామీలను అమలు చేయలేదని మండిపడ్డారు. డీఆర్‌ఓ మలోలకు నాయకులు వినతిపత్రం అందజేసి పరిస్థితి వివరించారు. కార్యక్రమంలో భగత్ సింగ్ ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు శ్రీనివాసులు, నాగరాజు, ఇర్ఫాన్, శివప్రసాద్, విశ్వనాథ్, మురళీ, నాగేంద్ర పాల్గొన్నారు.

గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం



మద్యం సీసాలతో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న మహిళ సమాఖ్య నాయకురాళ్లు

అనంతపురం అర్బన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోందని మహిళ సమాఖ్య అధ్యక్షకార్యదర్శులు పార్వతీప్రసాద్, పద్మావతి ధ్వజమెత్తారు. ప్రభుత్వ పెద్దలు, ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనూ గ్రామాల్లో బెల్టుషాపుల దందా జోరుగా సాగుతోందని మండిపడ్డారు. 'నాటుసారా, బెల్టుసాపులను నిర్మూలిద్దాం.. గ్రామాలను కాపాడుదాం' అనే నినాదంతో సోమవారం కలెక్టరేట్ ఎదుట మద్యం ఖాళీ సీసాలతో సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షకార్యదర్శులు మాట్లాడారు. ఎన్నికల సమయంలో మహిళలకు చంద్రబాబు ఇచ్చిన హామీల్లో అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ఉచిత బస్సు ఊసేలేదన్నారు. నెలకు రూ.1,500 ఇచ్చింది లేదన్నారు. 50 ఏళ్లకే పింఛను ఎప్పుడిస్తారో కూడా తెలియని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఉచిత గ్యాస్ ఒక్కరికిస్తే 10 మందికి ఇవ్వడం లేదన్నారు. తాను ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదానిని సీఎం చంద్రబాబు అమలు చేయలేదని మండిపడ్డారు. ప్రజల ధనమాన ప్రాణాలతో చెలగాటమాడేలా ఊరూరా బెల్టుషాపులు ఏర్పాటుకు అవకాశం కల్పించడం దారుణమన్నారు. గ్రామాల్లో బెల్టుషాపులను తొలగించకపోతే అన్ని మహిళా సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం డీఆర్‌ఓ ఎ.మలోలకు వినతిపత్రం అందజేశారు.

తం సూర్యం ప్రణమామ్యహం

సందర్భం: నేడు రథసప్తమి వేడుకలు



ఆదిదేవ నమస్తుభ్యం.. ప్రసీద మమ భాస్కర।
దివాకర నమస్తుభ్యం ప్రభాకర నమోస్తుతే॥

... అంటూ సకల చరాచర సృష్టికి జీవనహేతువైన సూర్యభగవానుడిని నమస్కరిస్తే సంపూర్ణ ఆరోగ్యంతో పాటు సుఖసంతోషాలతో విరాజిల్లుతారని హిందూ ధర్మం చాటి చెపుతోంది.

అనంతపురం కల్చరల్: హిందూ పురాణాల ప్రకారం సూర్య భగవానుడు మాఘ శుక్ల పక్షమి రోజునే జన్మించాడు. దీంతో ఏటా మాఘ మాసంలోని శుక్ల పక్షం ఏడవ రోజున రథ సప్తమిగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ పండగను అచల సప్తమి, సూర్య జయంతిగానూ పిలుస్తారు. ఈ పర్వదినాన్ని జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆలయాలను ముస్తాబు చేశారు.

జిల్లాకే ప్రత్యేకం..

దేశంలో ప్రసిద్ధి గాంచిన ఒడిశాలోని కోణార్క్, శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లి క్షేత్రాల తర్వాతి స్థానం జిల్లాలోని ఉరవకొండ మండలం బూదగవిలో వెలసిన సూర్యనారాయణుడి ఆలయానికి దక్కింది. దక్షిణాభిముఖంగా వెలసిన ఈ ఆలయంలోని సూర్యభగవానుడి మూలవిరాట్‌ను రథసప్తమి నాడు నేరుగా సూర్యకిరణాలు తాకుతాయి. అలాగే తాడిపత్రిలోని చింతల వేంకటరమణ స్వామి ఆలయంలోనూ రథసప్తమి నాడు నేరుగా సూర్య కిరణాలు స్వామివారిని తాకడం ఇక్కడి విశేషం. జిల్లా కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం, పాతూరులోని విరూపాక్షేశ్వరాలయం, మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం, శివకోటి, శివబాలయోగి ఆశ్రమం తదితర చోట్ల రథ సప్తమి నాడు విశేష పూజలు, నగరోత్సవాలు నిర్వహించనున్నారు. తెల్లవారుజాముననే సూర్యప్రభ వాహనంపై శ్రీవారిని ఊరేగించనున్నారు. వివేకానంద యోగకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 6 గంటలకు సామూహిక సూర్యనమస్కార యజ్ఞం నిర్వహించనున్నారు. అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలోని బాస్కెట్‌బాల్ మైదానంలో 108 సూర్యనమస్కార మంత్రాలతో సాగే ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని నిర్వాహకులు కోరారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి



సామూహిక అక్షరాభ్యాసాల్లో పాల్గొన్న చిన్నారులు

అనంతపురం కల్చరల్: చదువుల తల్లి సరస్వతీ మాత జన్మదినమైన వసంత పంచమి వేడుకలు సోమవారం పలుచోట్ల ఘనంగా జరిగాయి. వందలాది మంది చిన్నారులు సామూహిక అక్షరాభ్యాసాల్లో పాల్గొని చదువులకు శ్రీకారం చుట్టుకున్నారు. స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయం ప్రాంగణంలోని శంకరమఠంలో ఉదయం అక్షరాభ్యాసాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. అమ్మవారితో పాటూ మహాశివుడికి రుద్రాభిషేకాలు జరిగాయి. మధ్యాహ్నం తీర్థప్రసాద వినియోగం, అన్నప్రసాద వితరణ జరిగాయి. అలాగే శారదా నగర్‌లోని శృంగేరీ శారదా శంకర మఠానికి భక్తులు పోటెత్తారు. కార్యక్రమంలో సమాజం ప్రతినిధులు సీనియర్ న్యాయవాది నాగేశ్వరి, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

కరుణించు.. వేంకటేశ్వరా



గోమాతకు పూజలు చేస్తున్న మహిళలు

రాప్తాడు: చిన్మయ నగర్‌లో సోమవారం లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ 10వ వార్షికోత్సవం, వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. వేకువజామున వేద పండితుల ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి పూజ, కలశ పూజ, నవగ్రహ పూజ, వాస్తు పూజ, స్వస్తి పూజ నిర్వహించారు. మహిళలు గోవుకు ప్రత్యేక పూజలు చేసి, గోవు చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

సంక్షిప్త సమాచారం

షెల్టర్ హోం సందర్శన

అనంతపురం: నగరంలోని కమలానగర్‌లో ఉన్న షెల్టర్ హోంను సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి. శివప్రసాద్ యాదవ్ సోమవారం సందర్శించారు. అందులో ఉంటున్న వృద్ధుల ఆరోగ్య బాగోగులను అడిగి తెలుసుకున్నారు. సీనియర్ సిటిజెన్ యాక్ట్–2007 గురించి అవగాహన కల్పించారు. పెన్షన్, రేషన్ ఆధార్‌కార్డులు ఉన్నాయా? అని ఆరా తీశారు.

భక్తిశ్రద్ధలతో పోతప్ప విగ్రహ ప్రతిష్ట

ఆత్మకూరు: మండల పరిధిలోని సింగంపల్లి గ్రామంలోని చెరువు కట్ట వద్ద సోమవారం పోతప్ప స్వామి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. గ్రామంలోని మహిళలు బోనాలు ఊరేగించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామికి బోనాలు సమర్పించారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌కు సత్కారం

అనంతపురం: న్యూఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న జేఎన్‌టీయూ అనంతపురం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ ఎస్.వెంకటేష్ నాయక్‌ను సోమవారం సత్కరించారు. దేశ వ్యాప్తంగా 40 లక్షల మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లలో 200 మంది వలంటీర్లకు మాత్రమే రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనే అవకాశం ఉంటుంది. ఎస్.వెంకటేష్ నాయక్ జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఈ సందర్భంగా వెంకటేష్ నాయక్‌ను జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య, ఓఎస్డీటూ వీసీ ప్రొఫెసర్ ఎన్.దేవన్న, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ డాక్టర్ జి.మమత, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ శారద అభినందించారు.

సవీరా ఆస్పత్రిపై చర్యలు తీసుకోండి

అనంతపురం అర్బన్: ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కిమ్స్ సవీరా ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో డీఆర్‌ఓ మలోలను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, సహాయ కార్యదర్శులు అల్లీపీరా, రమణ, తదితరులు మాట్లాడుతూ.. రోగులకు ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందించకుండా డబ్బులు కడితేనే చికిత్స చేస్తామంటూ సవేరా ఆస్పత్రి యాజమాన్యం చెబుతోందన్నారు. ఆరోగ్యశ్రీ చికిత్స పొందవచ్చని బోర్డు పెట్టుకుని కూడా చికిత్స అందించడం లేదని మండిపడ్డారు. స్థానిక కల్పనా జోషి కాలనీలో నివాసముంటున్న శివప్రసాద్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళితే ఇదే పరిస్థితి ఎదురైందన్నారు. అత్యవసర సమయాల్లో రోగులకు ఆరోగ్యశ్రీ సేవలు అందించకుండా డబ్బులు గుంజుతున్న సవీరా ఆస్పత్రిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాషా, రామాంజి పాల్గొన్నారు.

మోడల్ పరీక్షలతో విద్యార్థుల్లో మనోధైర్యం

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో మనోధైర్యం నింపేందుకు మోడల్ పరీక్షలు ఉపయోగపడతాయని పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరరెడ్డి, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకుడు నారాయణ స్వామి అన్నారు. స్థానిక పీవీకేకే కళాశాలలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం మోడల్ ఎంసెట్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇంటర్ విద్యార్థులు బాగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో పీవీకేకే కళాశాల చైర్మన్ కిషోర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాధా జ్యోతి, జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, సహాయ కార్యదర్శి చందు, పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాలస్వామి

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాలస్వామి నియమితులయ్యారు. ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. బాలస్వామి ఏలూరు కార్పొరేషన్ కార్యదర్శిగా విధులు నిర్వరిస్తున్నారు. సెలవులో ఉన్న కమిషనర్ నాగరాజును సీడీఎంఏలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

కమనీయం.. కల్యాణం



అలంకరణలో శ్రీవల్లి, దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరుడి విగ్రహాలు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మాఘ మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వర, శ్రీవల్లి, దేవసేన ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. వేద పండితుల మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ పసుపు, కుంకుమ కలిపిన అక్షింతలతో స్వామికి కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

'ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి అరెస్ట్ దుర్మార్గం'

అనంతపురం ఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ఏఐఎస్ఎఫ్ విధానాలు నచ్చుతాయా? అని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుళ్లాయిస్వామి ప్రశ్నించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ముఖ్యమంత్రి సభలో నిరసన తెలియజేసిన అన్నమయ్య జిల్లా ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి మాధవ్‌ను అక్రమంగా అరెస్ట్ చేయించడం దుర్మార్గమన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాతో కలిసి పని చేశారు. ఆ రోజు మా విధానాలు, పోరాటాలు విద్యార్థుల కోసమే అని చెప్పిన చంద్రబాబుకు ఈరోజు అధికారంలోకి రాగానే మా విధానాలు ఆయనకు నచ్చడం లేదు అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏఐఎస్ఎఫ్ నాయకులను అడిగి అడిగి వినతిపత్రాలు ఇప్పించుకున్నారని గుర్తు చేశారు. ఆయన తనయుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మన ప్రభుత్వం వస్తుంది. సమస్యలను మీరు నేరుగా నా దృష్టికి తీసుకురావచ్చు అని తమతో చాలా సందర్భాల్లో చెప్పారని పేర్కొన్నారు. ఆమాటలు తండ్రీ కొడుకులు ఈ రోజు మరిచిపోతే ఎలా? అని ప్రశ్నించారు. విద్యార్థులు, యువతతో పెట్టుకుంటే మరో జన్మలో కూడా మీకు అధికారం లేకుండా చేస్తారనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని హెచ్చరించారు. తక్షణమే ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రంలో ఎక్కడ పర్యటించినా ఏఐఎస్ఎఫ్ నాయకులు అడ్డుకోవడానికి సిద్ధంగా ఉంటారని హెచ్చరించారు.

పరామర్శ



నాగేంద్రమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని గొందిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చియ్యేటి నాగేంద్రమ్మ కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సూచించారు. సోమవారం గొందిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు చియ్యేటి గోపాల్ రెడ్డి భార్య నాగేంద్రమ్మ, కుమారుడు చంద్రమౌళి రెడ్డి ఇద్దరూ ద్విచక్ర వాహనంలో ధర్మవరం బయలుదేరారు. 44వ జాతీయ రహదారి దాటుకుని వెళ్తుండగా సర్వీస్ రోడ్డుపై గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో నాగేంద్రమ్మ రోడ్డుపై కింద పడి తీవ్రంగా గాయపడింది. ఆమెను 108 ద్వారా అనంతపురంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆస్పత్రికి వెళ్లి నాగేంద్రమ్మను పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యార్థులకు అండగా నిలుస్తాం



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు సకాలంలో చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించలేదు. విద్యార్థులకు అండగా ఉంటామని మేయర్ వసీం పేర్కొన్నారు. సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.3,900 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత బకాయిలతో కలుపుకుని ఒకేసారి రూ.4 వేల కోట్లు చెల్లించిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేట్ తరహాలో పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు. దీంతో పాటుగా విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించేందుకు కృషి చేశారన్నారు. విద్యార్థులను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వానికి బుద్ధి చెబుతామన్నారు. మార్చి 12వ తేదీన జరిగే ఫీజు పోరును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు, కార్పొరేటర్లు రహంతుల్లా, శ్రీనివాసులు, అనిల్‌కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్, తదితరులు పాల్గొన్నారు.